
సాక్షి ఖమ్మం

మంగళవారం । 25 । మార్చి । 2025



ఆ స్థలం అనువుగా లేదు..

ఖమ్మం నియోజకవర్గ 'యంగ్ ఇండియా' స్కూల్ ప్రతిపాదిత స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించారు. 8లో



గరిష్టం / కనిష్టం
38° / 21°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఎండ ప్రభావం ఎక్కువే ఉంటుంది. ఉదయమే ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

ప్రైవేట్ ఆస్పత్రుల వివరాలు సమర్పించండి

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల యజమాన్యాలు నిబంధనలు అమలుపై వివరాలు అందజేయాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సైదులు ఆదేశించారు. ఆస్పత్రుల్లో లిఫ్టుల పనితీరు, వాటి కొనుగోలు బిల్లులు, నిర్వహణ సమాచారంతో పాటు అగ్నిమాపక శాఖ నిబంధనల అమలుపై వివరాలు సమర్పించాలని సూచించారు. ఇటీవల ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో లిఫ్ట్ తీగ తెగి మహిళ మృతి చెందిన నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఈ వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

పెద్దాస్పత్రి మార్చురీకి అదనంగా ఫ్రీజర్లు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మార్చురీకి నాలుగు కొత్త ఫ్రీజర్లు చేరాయి. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తన నిధుల నుంచి వీటిని కేటాయించారు. మార్చురీలో ప్రస్తుతం ఉన్న ఫ్రీజర్లు నాలుగు తరచూ మొరాయిస్తుండటంతో మృతదేహాల భద్రత కష్టమవుతోంది. పలుమార్లు మార్చురీ నుండి దుర్గంధం వెదజల్లుతోంది. ఇటీవల పెద్దాస్పత్రికి ఎంపీ వచ్చినప్పుడు ఫ్రీజర్ల పరిస్థితిని అధికారులు వివరించగా సోమవారం నాలుగు ఫ్రీజర్లను పంపించారు.

ఖేలో ఇండియా పోటీల్లో కాంస్యం



పవిత్రాచారి

ఖమ్మం స్పోర్ట్స్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా జాతీయస్థాయి సీనియర్ మహిళల ఉషూ టోర్నీలో ఖమ్మంకు చెందిన పి.పవిత్రాచారి కాంస్య పతకం సాధించింది. ఈనెల 20నుంచి 23వ తేదీ వరకు కొనసాగిన టోర్నీలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆమె, నుదిటిపై గాయమైనా పట్టు వదలకుండా నాన్‌దావో ఈవెంట్‌లో ప్రతిభ కనబర్చింది. కాగా, ఖేలో ఇండియా పోటీలో వరుసగా మూడేళ్ల నుంచి పవిత్ర పతకం సాధిస్తుండడం విశేషం. ఈసందర్భంగా ఆమెతో పాటు కోచ్ పరిపూర్ణాచారిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ప్రశాంతంగా ఎస్సెస్సీ పరీక్షలు



ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈమేరకు సోమవారం 97 పరీక్ష కేంద్రాల్లో 16,376 మందికి గాను 16,344మంది హాజరు కాగా 32మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీజ ఒక కేంద్రం, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రెండు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 38 కేంద్రాలను తనిఖీ చేయగా తాను ఆరు కేంద్రాల్లో పరిశీలించానని వెల్లడించారు.

■ నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం, సింగారెడ్డిపాలెంలో పదో తరగతి పరీక్షల కేంద్రాలను డీఈఓ సోమవారం తనిఖీ చేసి మాట్లాడారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా నిబంధనల మేరకు పరీక్షలు నిర్వహించేలా డీఓలు, సీఎస్‌లకు సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ బి.చలపతిరావు పాల్గొన్నారు.

ఇందిరమ్మకు అడుగులు



చిన్నగోపతిలో పునాది స్థాయికి చేరిన ఇంటి వద్ద లబ్ధిదారులు

- ఫైలట్‌గా 20 జీపీల్లో 850 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- ఆ గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభం
- మిగతా ప్రాంతాల్లో ఎల్‌–1 జాబితా పునఃపరిశీలన
- దశల వారీగా త్వరలోనే ఇళ్ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం పటిష్టంగా అమలుచేసేలా అడుగులు పడుతున్నాయి. గత జనవరి 26న గ్రామసభలు నిర్వహించిన 20గ్రామపంచాయతీల్లో పలువురికి ఇళ్లు మంజూరు చేశారు. అందులో కొన్ని బేస్‌మెంట్ స్థాయికి చేరగా.. మిగిలిన పంచాయతీల్లో లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. మరోవైపు ఖమ్మం కార్పొరేషన్, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఎల్‌–1జాబితాపై రీ వెరిఫికేషన్ కొనసాగుతోంది. ఇందులో అర్హులను గుర్తించి కలెక్టర్‌కు పంపించాక ఎంపిక పూర్తి చేయనున్నారు.

850 ఇళ్లు మంజూరు..

రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలను ఈ ఏడాది జనవరి 26న ప్రారంభించింది. అందులో భాగంగా అదేరోజు గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రకటించారు. జిల్లాలోని 20 గ్రామపంచాయతీలకు సంబంధించి ఎంపీడీఓలు 1,017 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా తేల్చగా, అందులో 962 దరఖాస్తులను కలెక్టర్ ఆమోదించారు. ఆపై 112 దరఖాస్తులను తొలగించి చివరగా 850 మందిని ఎంపిక చేశారు. ఇందులో 470 ఇళ్లకు సంబంధించి జియో ట్యాగ్ చేయగా, మరో 49 ఇళ్లు పునాదిదశలో ఉన్నాయి. ఇంకో 44 దరఖాస్తులను ఎంపీడీఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది.

మోడల్‌హౌస్‌ల నిర్మాణం

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా మోడల్‌హౌస్‌ల నిర్మాణాన్ని చేపట్టింది. ప్రభుత్వం మంజూరు చేసే రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం ఎలా చేపట్టవచ్చో తెలియచేయడమే వీటి లక్ష్యం. పాలేరు నియోజకవర్గం కూసుమంచిలో మోడల్‌హౌస్ నిర్మాణం పూర్తి కాగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఇక్కడ 400 చదరపు అడుగుల స్థలంలో హాల్, కిచెన్, అటాచ్డ్ బాత్‌రూమ్‌తో ఇల్లు నిర్మించారు. ఇంటిలోపల గదులు, వరండాల్లో టైల్స్ వేయడమే కాక దాబా మెట్ల కింద టాయిలెట్ నిర్మించారు. ఇంట్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు ఫ్యాన్లు, ఇంటికి రంగులు అన్నింటినీ రూ.5లక్షల్లోనే పూర్తి చేశారు.

మూడు కేటగిరీలుగా ఇళ్లు..

ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారిని మూడు కేటగిరీలుగా విభజించారు. సొంత జాగా ఉండి గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన, అద్దె ఇళ్లలో ఉండే వారిని ఎల్‌–1(లిస్ట్)గా గుర్తించారు. అదే గుడిసె, రేకులషెడ్, టైల్స్ వేసిన ఇళ్లు, అద్దె ఇళ్లలో ఉంటూ స్థలం కూడా లేని వారిని ఎల్‌–2కేటగిరీగా, ఇళ్లు ఉండి.. తల్లిదండ్రుల నుంచి విడిపోయిన తమకు ఇళ్లు కావాలని దరఖాస్తు చేసుకున్న వారిని ఎల్‌–3 కేటగిరీగా విభజించారు. ఈ కేటగిరీల వారీగా వివిధ దశల్లో ఇళ్ల మంజూరు జరగనుంది. అయితే, ఎల్‌–1 జాబితాలో వారికే మంజూరులో ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

జాబితాల రీ వెరిఫికేషన్

ఖమ్మం కార్పొరేషన్‌తోపాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో ఎల్‌–1 కేటగిరీలో లబ్ధిదారులు 60,747 మంది దరఖాస్తులను పునః పరిశీలన చేస్తున్నారు. ఈ ప్రక్రియ అటు జీపీలు, ఇటు కేఎంసీ, మున్సిపాలిటీల్లోనూ కొనసాగుతోంది. ఇక్కడ కూడా కేటగిరీల వారీగానే లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. రీ వెరిఫికేషన్ తర్వాత అర్హుల జాబితాను కలెక్టర్‌కు పంపిస్తారు. ఆపై ఎమ్మెల్యేలు, జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి పరిశీలించి.. దశల వారీగా ఇళ్లు మంజూరు చేయనున్నారు.

అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నాం..



ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం రీవెరిఫికేషన్ కొనసాగుతోంది. జీపీలు, మున్సిపాలిటీల్లో వచ్చిన దరఖాస్తులను యంత్రాంగం పరిశీలించాక ఎందరు లబ్ధిదారులో తేలుతుంది. ఆపై జాబితాను కలెక్టర్‌కు అప్పగిస్తే ఎంపిక పూర్తవుతుంది. జిల్లాలో మొదటి విడతగా జనవరి 26న మంజూరు చేసిన 850 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

– భూక్యా శ్రీనివాస్, పీడీ, గృహ నిర్మాణ శాఖ

20 మినహా మిగిలిన జీపీల్లో అందిన దరఖాస్తులు	అర్హత సాధించినవి	ఎల్‌-1 కేటగిరీ	ఎల్‌-2	ఎల్‌-3	గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హులు
3,40,923	60,747	44,008	2,910	9,293	4,536

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా

తిరుమలాయపాలెం: మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన ఏలువారిగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని జెడ్పీ సీఈఓ దీక్షారైనా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌కు సూచించారు. ఆతర్వాత తిరుమలాయపాలెం, పిండిప్రోలులో ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించడమే కాక సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి దరఖాస్తులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారంలో జాప్యం జరగదొద్దని సూచించారు. ఒకవేళ ఏదైనా దరఖాస్తును తిరస్కరిస్తే అందుకు కారణాలను తెలియచేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వేతనం ఇప్పించండి..



కుల గణన సర్వే ద్వారా వెల్లడైన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు జిల్లాలో 250మంది వరకు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పనిచేశారు. ఒక్కో ఎంట్రీకి రూ.30ఇస్తామని చెప్పిన అధికారులు ఇప్పటికీ నగదు చెల్లించలేదు. ఒక్కొక్కరికి రూ.10వేల నుంచి రూ.30వేల వరకు వచ్చే అవకాశమున్నందున మంజూరు చేయాలని ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

మూడేళ్లుగా తిరుగుతున్నా...



ఖానాపురంలో అద్దెకు ఉంటున్నాం. నా భర్త కూలీ పనులకు వెళ్తాడు. మా చిన్న కుమారుడి ఆరోగ్యం బాగా లేక నాటి కలెక్టర్ డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తానని హామీ ఇచ్చారు. మూడేళ్లుగా అధికారులు పట్టించుకోకపోవడంతో మళ్లీ కలెక్టరేట్‌కు వచ్చా.

– ఆర్.సులోచన, ఖమ్మం

క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..

డీటీసీఓ డాక్టర్ సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీఓ సుబ్బారావు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాను క్షయరహితంగా తీర్చిదిద్దే ప్రయత్నాలకు అందరూ సహకరించాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వరికూటి సుబ్బారావు సూచించారు. జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు ఉన్నా, రాత్రి పూట చమటలు పట్టినా, ఆకలి మందగించినా క్షయ వ్యాధి లక్షణాలుగా భావిస్తూ సమీప ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. ఒకవేళ టీబీ నిర్ధారణ అయితే ఉచితంగా మందులను ఇంటికి పంపిస్తామని, పోషకాహారం నిమిత్తం నెలకు రూ.వెయ్యి చొప్పున అకౌంట్‌లో జమ అవుతాయని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 35 జీపీలను క్షయ రహితంగా ప్రకటించగా... డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన సంజన(సత్తుపల్లి), ఏంజెల్(ఖమ్మం)కు బహుమతులు, టీబీ వ్యాధి నిర్మూలనకు కృషి చేసిన ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లకు అవార్డులు అందజేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటిండెంట్ ఎల్. కిరణ్‌కుమార్, వైద్యులు బాబురత్నాకర్, కిరణ్‌కుమార్, రామారావు, వెంకటరమణ, మోహన్‌రావు, తదితరలు పాల్గొన్నారు.

మూడో లైన్ పనుల తనిఖీ



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్

ఖమ్మం రాపర్తినగర్/చింతకాని: ఖమ్మం– పందిళ్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ నిర్మాణ పనులను అధికారులు సోమవారం పరిశీలించారు. దక్షిణ మధ్య రైల్వే సేఫ్టీ కమిషనర్ మాధవి, డీఆర్‌ఎం భర్తేష్‌కుమార్ జైన్ తనిఖీల్లో పాల్గొనగా.. ఇప్పటివరకు పూర్తయిన లైన్‌పై రైలు నడిపించారు. మరోమారు పూర్తిస్థాయిలో సేఫ్టీ రన్ చేపట్టాక రైళ్లు నడపడానికి అనుమతిస్తామని అధికారులు తెలిపారు. ఖమ్మం స్టేషన్ మాస్టర్ ప్రసాద్, అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, సంజీవ్ యాదవ్, సునీల్‌కుమార్ వర్మ, సత్యప్రకాష్, సురంజన్‌రెడ్డి, శ్రీనివాసరావు, గుడేషర్ తదితరులు పాల్గొన్నారు. ఈమేరకు పందిళ్లపల్లి స్టేషన్‌లో అధికారులు మొక్కలు నాటారు.

■ చింతకాని: చింతకాని మండలం పందిళ్లపల్లి స్టేషన్‌లో గూడ్స్ రైళ్ల ద్వారా సరుకుల దిగుమతికి రేక్ పాయింట్ ఏర్పాటు చేస్తున్నందున స్థానికులకే హమాలీలుగా అవకాశం కల్పించాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా అధికారులకు హమాలీ వర్కర్ల యూనియన్ బాధ్యులు వినతిపత్రం అందజేశారు. ఖమ్మంలోని రేక్ పాయింట్‌లో హమాలీలుగా పనిచేసిన వారితో పాటు పందిళ్లపల్లి, రామకృష్ణాపురం, గాంధీనగర్‌కాలనీ, అనంతసాగర్, కొదుమూరు, లచ్చగూడెం వాసులకు సైతం అవకాశం కల్పించాలని కోరారు.

ఖజానా శాఖ ఉద్యోగులపై కలెక్టర్ కన్నెర్ర?

ఖమ్మం సహకారనగర్: జిల్లా ఖజనా శాఖ కార్యాలయ ఉద్యోగులపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శాఖలోని అధికారులు, సిబ్బంది నడుమ సఖ్యత లేక ఇటీవల వాగ్వాదం చోటుచేసుకుందనే ప్రచారం జరిగింది. ఈక్రమాన టీఎన్జీవోస్ నాయకులు శాఖ డీడీతో చర్చించారు. దీంతో కలెక్టర్ సోమవారం ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీఎస్.నర్సింహంతో పాటు ఏటీఓలు, ఎస్‌టీఓలు, ఇతర ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈనేపథ్యాన కొందరి తీరుపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇకపై తీరు మారకపోతే కఠినచర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించినట్లు తెలిసింది. అయితే, శాఖలోని అధికారులు, సిబ్బంది మధ్య అంతర్గత పోరుతో పంతానికి పోయి తరచూ వాగ్వాదానికి దిగుతున్నట్లు సమాచారం. ఈనేపథ్యాన నేరుగా కలెక్టర్ మందలించడంతో శాఖ డీడీ సైతం శాఖ ఉద్యోగులతో సమావేశమై సూచనలు చేసినట్లు తెలిసింది.

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గోదావరి జలాలేవి?

వైరాకు గోదావరి రానట్లేనా?

- లింక్ కెనాల్ పూర్తయినా రిజర్వాయర్‌కు చేరని నీరు
- ఎన్నెస్పీ కాల్వలోకి చేరాక ఇతర ప్రాంతాలకు మళ్లింపు
- వేసవి నేపథ్యాన రిజర్వాయర్‌లో తగ్గుతున్న నీటిమట్టం



ఏన్కూరు వద్ద సాగర్ కెనాల్‌లో కలుస్తున్న గోదావరి నీరు (ఫైల్)

వైరా: గోదావరి జలాలు తమ ప్రాంతానికి వస్తాయని.. సాగర్ ప్రాజెక్టు ద్వారా నీరు రాకున్నా ఇక్కట్లు ఉండబోవని వైరా ప్రాంత రైతులు కలలు కన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాధ్యం కాని ఈ ప్రాజెక్టు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూపుదాల్చడంతో ఆరు నెలల్లోనే నీరు అందుతుందని.. తద్వారా యాసంగిలో సాగునీటికే కాక వేసవిలో తాగునీటికి ఢోకా ఉండదని భావించారు. అయితే, ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణం పూర్తయినా వైరా రిజర్వాయర్‌కు నీరు చేరకపోగా ఇతర ప్రాంతాలకు మళ్లించడంతో వారి ఆశలు నెరవేరేదెన్నడో తెలియరావడం లేదు.

గత ఏడాది శంకుస్థాపన..

సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాల్వ నుంచి ఏన్కూరు సమీపాన ఎన్నెస్పీ కెనాల్‌లోకి గోదావరి నీరు చేర్చేందుకు గాను రాజీవ్ లింక్ కెనాల్ నిర్మాణానికి సంకల్పించారు. ఈమేరకు గత ఏడాది మార్చి 13న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ కెనాల్ నిర్మాణం ఇటీవల పూర్తవడంతో ఈనెల 5వ తేదీన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి జలాలను విడుదల చేశారు.

ఎస్కేప్ లాక్‌లు మూసివేస్తేనే...

ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణం పూర్తవడంతో ఈనెల 5న సీతారామ ప్రాజెక్టు నుంచి కెనాల్‌లోకి గోదావరి జలాలను మంత్రి తుమ్మల విడుదల చేశారు. ఈ నీరు సాఫీగా ముందుకు సాగి ఎన్నెస్పీ కెనాల్‌లోకి చేరింది. ఆపై నీరు వైరా రిజర్వాయర్‌లోకి చేరాలి. అలా జరగకపోగా సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు మళ్లాయి. ఏన్కూరు సమీపాన ఎన్నెస్పీ కెనాల్ నుంచి 13 కి.మీ. మేర జలాలు ప్రవహించి తిమ్మరావుపేట ఎస్కేప్ లాక్‌ల ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి చేరాల్సి ఉంటుంది. ఇందుకోసం అధికారులు ముందుగానే లాక్‌లు కూడా ఏర్పాటు చేశారు. అయితే, లాక్‌లు వేయకపోగా.. నీటి ఉధృతి లేకపోవడంతో వెనక్కి రాలేదు. కాగా, 600 క్యూసెక్కుల నీరే కెనాల్‌లో ప్రవహిస్తోందని, ఇది 800 క్యూసెక్కులకు చేరితేనే నిమ్మవాగు ద్వారా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. దీంతో ఇది ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్న రైతులను వేధిస్తోంది. ఎండలు పెరుగుతుండడంతో రిజర్వాయర్‌లో నీరు అడుగంటుతుండగా, సాగర్ జలాలను వారబందీ విధానంలో విడుదల చేస్తున్నారు. కనీసం గోదావరి నీరయినా వస్తుందని తద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు, 16మండలాలకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉండబోవని భావిస్తే అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొనడం గమనార్హం.

ఏడాదిగా చూస్తున్నాం..



గోదావరి జలాలు వైరా రిజర్వాయర్‌లోకి వస్తాయని ఏడాదిగా చెబుతున్నారు. ఇటీవల నీరు విడుదల చేయగానే రిజర్వాయర్‌లోకి చేరతాయని అందరం అనుకున్నాం. కానీ ఇప్పటికీ ఆ నీరు రాలేదు. పంటల చివరి దశలో ఇబ్బంది ఉండదని భావిస్తే ఆ పరిస్థితి కానరావడం లేదు.

– వి.కృష్ణారెడ్డి, రైతు, గరికపాడు

రెండు పంటలు పండుతాయని



వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరితే రెండు పంటలు పండుతాయని ఎదురుచూశాం. అయితే, ప్రభుత్వం మారినా వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు రాలేదు. పంపులు ఆన్ చేశారని చెప్పినా మా వైపు నీరు రాకపోగా.. కారణాలు ఎవరూ చెప్పడం లేదు.

– జె వెంకటరమణ, రైతు, దాచాపురం

త్వరలోనే గోదావరి నీళ్లు..



వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి నీళ్లు తప్పక చేరతాయి. రైతులెవరూ ఆందోళన చెందొద్దు. ఈ విషయంలో పూర్తి బాధ్యత నేనే తీసుకుంటా. అతి త్వరలోనే రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరడం ఖాయం.

– మాలోత్ రాందాస్ నాయక్, ఎమ్మెల్యే, వైరా

క్లుప్తంగా

తెలుగు అధ్యాపకుడికి డాక్టరేట్


వెంకటేశ్వర్లు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లుకు డాక్టరేట్ లభించింది. కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం ప్రొఫెసర్ పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆయన 'డాక్టర్ సీతారాం సాహిత్యం – ఒక అధ్యయనం' అంశంపై పరిశోధనాత్మక గ్రంధాన్ని సమర్పించగా కేయూ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లును కళాశాల ప్రిన్సిపాల్ జకీరుల్లా , అధ్యాపకులు, జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు తదితరులు సోమవారం అభినందించారు.

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన రెసిడెన్షియల్ బాలికల డిగ్రీ గురుకుల కళాశాల(లక్ష్య ఇంజనీరింగ్ కాలేజీ)లో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి ఎన్.మాధవి తెలిపారు. హైదరాబాద్, విజయవాడ పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉండగా, డిగ్రీ పాసై 18–30 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఈమేరకు విద్యార్హతల సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లతో బుధవారం ఉదయం 10గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.

మొరాయించిన సర్వర్లు..


వివరాలు ఆరా తీస్తున్న దరఖాస్తుదారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో వస్తున్న తరుణంలో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ఈక్రమంలోనే సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు సర్వర్లు నిలిచిపోవడంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు ఓపెన్ కాలేదు. దీంతో ఫీజు చెల్లించేందుకు కేఎంసీ కార్యాలయానికి వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఫీజు రాయితీ గడువు ఇంకో వారంలో ముగియనుండగా పలువురు ఉదయమే కౌంటర్ల వద్దకు వచ్చారు. అయితే, ఉదయమంతా సర్వర్లు మొరాయించగా.. మధ్యాహ్నం తర్వాత పని చేశారని ఉద్యోగులు తెలిపారు.

వాటర్ బాటిళ్లు ఏమయ్యాయి?

కలెక్టరేట్‌లో 150కిపైగా సీసాలు మాయం


గతంలో కొనుగోలు చేసిన బాటిళ్లలో ఒకటి..

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశాలకు హాజరయ్యే అధికారులు, ఉద్యోగులకు తాగునీరు సమకూర్చేందుకు గాను గతంలో విధులు నిర్వర్తించిన కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సుమారు 200 వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయించారు. అందరూ మిషన్ భగీరథ నీటినే తాగాలనే ఉద్దేశంతో వీటిని సమకూర్చారు. అయితే, అప్పుడొకటి.. ఇప్పుడొకటి అన్నట్లు బాటిళ్లు మాయమవుతుండగా ప్రస్తుతం 50కూడా లేవని సమాచారం. ప్రస్తుత కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌ను ప్లాస్టిక్ ఫ్రీగా మార్చాలనే లక్ష్యంతో శాఖల వారీగా ఎన్ని స్టీల్ బాటిళ్లు కావాలో నివేదిక ఇవ్వాలని సూచించారు. దీంతో గతంలో కొనుగోలు చేసిన బాటిళ్లపై అధికారులు ఆరా తీయగా 200కు గాను 150మేర కనిపించడం లేదని తేల్చినట్లు సమాచారం. దీంతో ఈ బాటిళ్లు ఎవరు తీసుకెళ్లారు, ఎలా మాయమయ్యాయనే అంశంపై కలెక్టరేట్‌లో చర్చ జరుగుతోంది

సింగరేణి విద్యార్థినుల ప్రతిభ

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 19న ఖమ్మంలోని కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఫెస్టివల్‌కు మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి 108 మంది హాజరుకాగా, ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి ఎంపిక చేసి బహుమతులు అందించారు. సింగరేణి కళాశాల విద్యార్థినులు కె.వెన్నెల, ఎండీ ఆయేషా మూడో, నాలుగో స్థానాల్లో నిలవగా సోమవారం ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్, కరస్పాండెంట్ కే.సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ చింతల శారద తదితరులు అభినందించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	5,875	3,500
కందులు	6,500	6,000
వేరుశనగ	6,350	6,350
ఏసీ మిర్చి	14,200	9,500
తాలు మిర్చి	6,000	5,000

– ఖమ్మం వ్యవసాయం

ఆ స్థలం అనువుగా లేదు...

- ఖమ్మంలో 'యంగ్ ఇండియా స్కూల్' నిర్మాణంపై మల్లగుల్లాలు
- గతంలోనే శంకుస్థాపన చేసినా మొదలుకాని పనులు
- ప్రత్యామ్నాయ స్థలం కోసం అధికారుల అన్వేషణ


స్కూల్ భవనానికి కేటాయించిన స్థలంలో గుంతలు, గుట్టలు

రఘునాథపాలెం: ఖమ్మం నియోజకవర్గంలో మంజూరైన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రతీ నియోజకవర్గానికి ఒక స్కూల్‌ను మంజూరు చేయగా ఖమ్మం నియోజకవర్గానికి సంబంధించి రఘునాథపాలెం మండలంలోని జింకలతండా క్రాస్ సమీపాన సర్వే నంబర్ 20లో ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఈమేరకు అక్టోబర్ 11న మంత్రులు శంకుస్థాపన కూడా చేశారు. అయితే, ఇటీవల ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు ఇక్కడి భూమి భవన నిర్మాణానికి అనువుగా లేదని, గుంతలు, గుట్టలతో నిండి ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతాయని నివేదిక సమర్పించారు. ప్రత్యామ్నాయ భూమిని కేటాయిస్తేనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేయడంతో అధికారులు అనువైన స్థలం కోసం అన్వేషణ మొదలుపెట్టారు. కాగా, స్కూల్‌కు తొలుత కేటాయించిన భూమిలో గుట్ట ఉండడంతో అక్కడ గ్రావెల్ కోసం తవ్వకాలు జరిగాయి. అయితే, తవ్వకాలు సమాంతరంగా కాక ఇష్టారాజ్యంగా చేపట్టడంతో కొన్నిచోట్ల పెద్ద గుంతలు, మరికొంత భాగం గుట్టలు, బండరాళ్లతో మిగిలిపోయింది. ఈనేపథ్యాన స్కూల్ భవన నిర్మాణానికి అనువుగా లేదని తేల్చడంతో ప్రత్యామ్నాయంగా 25నుంచి 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందోనని గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

కలెక్టర్ పరిశీలన


స్థలాల లభ్యతపై ఆరా తీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన భూమి కోసం అన్వేషణ మొదలుపెట్టిన అధికారులు పలుచోట్ల భూములను గుర్తించినట్లు తెలిసింది. ఈమేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఆర్డీఓ జి.నర్సింహారావు, తహసీల్దార్ విల్సన్‌బెన్నీ సోమవారం పరిశీలించారు. శివాయిగూడెం వద్ద సర్వే నంబర్ 266, రఘునాథపాలెం బైపాస్‌లో మెడికల్ కాలేజీకి కేటాయించిన భూమికి సమీపంలో స్థలాలను పరిశీలించి వివరాలు ఆరా తీశారు. రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎక్కడ భూమి ఖరారు చేస్తారో త్వరలోనే తేలే అవకాశముంది.

రైతుకు లాభాలు పెంచడమే లక్ష్యం

- అధికారుల అవగాహనతో ఫలితాలు
- వ్యవసాయ విస్తరణ సలహా సంఘం సమావేశంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్‌ముజమ్మిల్ ఖాన్, పక్కన డాక్టర్ బలరామ్ తదితరులు

వైరా: పంటల సాగునే నమ్ముకున్న రైతులు లాభాలు ఆర్జించడమే ధ్యేయంగా అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన మధ్య తెలంగాణ(ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మెదక్) మండల వ్యవసాయ పరిశోధనా విస్తరణ సలహా సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15, 20ఏళ్లుగా రైతుల ఆదాయం గణనీయంగా తగ్గుతోందన్నారు. గతంలో వరిపై ఎకరాకు రూ.40వేల ఆదాయం వస్తే ఇప్పుడు రూ.20వేలు కూడా రావడం లేదన్నారు. దీనికి తోడు వాతావరణ మార్పులతోనూ వారు నష్టపోతున్నారన్నారు. ఈమేరకు కేవలం వరి, తదితర పంటలపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించేలా అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటలు సాగు చేయడం, ఆధునిక విధానాలు పాటించడంపై ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. ఇందుకోసం జిల్లాలోని ప్రతీ గ్రామం, మండలం, డివిజన్ స్థాయిలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ బలరామ్, విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎం.యాదాద్రి, మధ్య తెలంగాణ రీజియన్ సహాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి, డీడీఏ సింగారెడ్డి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, మధిర వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి మాట్లాడారు. వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టర్లు, వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, ఉమ్మడి ఖమ్మం, మెదక్, వరంగల్ జిల్లాల వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ఆర్ఈఏసీ సభ్యుడు రాణాప్రతాప్, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

కాలానికి అనువైన పంటలతో మేలు

రైతులు ఎప్పటికప్పుడు కాలానికి అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని.. తద్వారా నష్టం లేకుండా అధిక దిగుబడులు సాధించొచ్చని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఎం.బలరామ్ తెలిపారు. వ్యవసాయ పరిశోధనా విస్తరణ సలహా సంఘం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన ఆయన వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం బలరామ్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, మార్కెట్‌లో డిమాండ్‌ను తెలుసుకుంటూ పంటల సాగులో మెళకువలు పాటిస్తే ఫలితం ఉంటుందని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి కూపన్లు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వనం వారి కిష్టాపురం వద్ద సోమవారం తహసీల్దార్ సునీత ఎలిజబెత్ తనిఖీలుచేపడుతుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలింది. దీంతో రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సదరమ్ శిబిరాలు ఎప్పుడు?

- యూడీఐడీ కార్డుల పేరుతో జాప్యం
- తేదీలు ఖరారు కాక దివ్యాంగుల ఎదురుచూపులు

ఖమ్మంవైద్యవిభాగం: దివ్యాంగులు ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ పథకాలను అందుకునేలా యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు(యూడీఐడీ) ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. సదరమ్ సర్టిఫికెట్ల స్థానంలో వీటిని జారీ చేయాలనే ప్రభుత్వ ఆలోచనగా వెల్లడించారు. ఇది మంచి నిర్ణయమే అయినా ఈ కార్డుల పేరులో జిల్లా పెద్దాస్పత్రిలో నిర్వహించే సదరమ్ శిబిరాలను కొంతకాలంగా నిలిపివేశారు. దీంతో శిబిరాలు ఎందుకు నిలిచిపోయాయో తెలియక దివ్యాంగులు పలువురు పెద్దాస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు సైతం స్పష్టమైన ప్రకటన జారీ చేయకపోవడంతో వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మార్గదర్శకాలు ఏవీ

యూడీఐడీ కార్డులకు సంబంధించి ఇంత వరకు మార్గదర్శకాలు వెలువడలేదు. ఇన్నాళ్లు దివ్యాంగులు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే ఆస్పత్రిలో శిబిరానికి ఎప్పుడు రావాలో సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపేవారు. నిర్ణీత తేదీన వెళ్తే వైద్యనిపుణులు పరీక్షించి సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులా, కాదా అన్నది తేల్చేవారు. ఆ తర్వాత సర్టిఫికెట్‌ను దివ్యాంగుల అడ్రస్‌కు పంపించేవారు. కానీ ప్రస్తుతం కేంద్రప్రభుత్వం జారీ చేయనున్న యూడీఐడీ కార్డులపై మార్గదర్శకాలు వెలువడకపోగా.. సదరమ్ శిబిరాలు ఎప్పుడు నిర్వహించాలో తమకు సైతం స్పష్టత లేదని అధికారులు చెబుతున్నట్లు సమాచారం. కాగా, సదరమ్ విభాగంలోని సిబ్బందికి యూడీఐడీ కార్డులపై శిక్షణ పూర్తికాగా, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపకల్పనలో జాప్యం జరుగుతోందని సమాచారం.

స్లాట్ బుక్ చేసుకుని...

యూడీఐడీ కార్డులను ఇప్పటికే పలు రాష్ట్రాల్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. సదరమ్ సర్టిఫికెట్ కేవలం తెలంగాణ లోనే చెల్లుబాటవుతోంది. కానీ యూడీఐడీ కార్డు ద్వారా దివ్యాంగులు దేశంలో ఎక్కడైనా వారికి లభించే సౌకర్యాలు వినియోగించుకోవచ్చు. కానీ కార్డుల జారీలో జాప్యం జరుగుతుండడంతో జిల్లాలో దివ్యాంగులు 700 మంది స్లాట్ బుక్‌చేసుకుని ఎదురుచూస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి స్లాట్ బుక్ చేసుకున్న వారి సెల్‌ఫోన్లకు సమాచారం ఇస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. ఈ విషయమై పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా యూడీఐడీ కార్డుకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తయిందని తెలిపారు. మార్గదర్శకాలు కూడా వచ్చాయని, ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చాక శిబిరాలు ప్రారంభిస్తామని వెల్లడించారు.

వేటకు అమర్చిన తీగలు తాకి మృతి


కరుణాకర్ మృతదేహం

ఏన్కూరు: అటవీ జంతువులను వేటాడేందుకు వెళ్లిన యువకుడు విద్యుదాఘాతంలో మృతి చెందిన ఘటన ఏన్కూరు మండలం నెమలిపురి సమీపాన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన మేకల కరుణాకర్(18) వద్దకు అదే గ్రామానికి చెందిన జక్కుల రాములు, జక్కుల ప్రవీణ్ సాయంత్రం వచ్చి వేటకు తీసుకెళ్లారు. అయితే, రాత్రి 9–30 గంటలకు జక్కుల రాములు, జక్కుల ప్రవీణ్ కలిసి కరుణాకర్ ఇంటికి వచ్చి ఆయన విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు కుటుంబీకులకు తెలిపారు. దీంతో ఘటనాస్థలికి వెళ్లి చూడగా కరుణాకర్ మృతదేహం, సమీపాన విద్యుత్ తీగలు కనిపించాయి. అయితే, వీరు వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తాకడంతో మృతి చెందాడా, అప్పటికే ఇతరులు అమర్చిన తీగలతో ప్రమాదం జరిగిందా అనేది తెలియరాలేదు. ఘటనపై కరుణాకర్ తండ్రి కోటయ్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

గిరిజనులందరికీ సంక్షేమ ఫథకాలు అందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: అర్హులైన ప్రతీ గిరిజనుడికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశం మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌కు హాజరైన వారి నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. వారి వినతులను యూనిట్ అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. అర్హులైన గిరిజన కుటుంబాలకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నాణ్యమైన క్రీడా సామగ్రి పంపిణీ చేయాలి

టెండర్ నిబంధనల మేరకు విద్యార్థులకు నాణ్యమైన క్రీడా సామగ్రి, దుస్తులు సరఫరా చేయాలని పీఓ టెండర్‌దారులకు సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ క్రీడా పాఠశాలలకు సరఫరా చేసే టీ షర్ట్, షార్ట్, ట్రాక్ షూట్ క్రీడా సామగ్రి టెండర్ ప్రక్రియను ఆయన ప్రారంభించారు. టెండర్ సమయంలో చూపిన శాంపిల్ ప్రకారమే సరఫరా చేయాలని, కోచ్‌లు, ప్రధానోపాధ్యాయులు పరిశీలించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారి లైసెన్స్‌లు రద్దు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం గిరిజన మ్యూజియంలో పనులు పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాలల్లో ఐటీడీఏ ఏపీఓ జనరల్ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఏఓ సున్నం రాంబాబు, ఎస్ఓ ఉదయభాస్కర్, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, ఏపీఓ వేణు, లక్ష్మీనారాయణ, సమ్మయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లొస్తుండగా ప్రమాదం

- చెట్టును కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతి
- పావు గంటలో ఇంటికి చేరతారనగా ఘటన


రాము (ఫైల్)


కృష్ణమూర్తి (ఫైల్)

ఖమ్మంరూరల్: ఆ ముగ్గురూ స్నేహితులు. ఒకే రంగంలో కొనసాగుతుండడంతో ఎక్కడికైనా కలిసి వెళ్లడం ఆనవాయితీ. ఈ క్రమాన శ్రీశైలంలో దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. అయితే, యాత్ర ఆసాంతం సాఫీగా జరిగి ఇంకో పావుగంటలో ఇంటికి చేరతామనగా ఈ ప్రమాదం జరగడంతో రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.

జేసీబీల వ్యాపారం...

ఖమ్మం నగరం దానవాయిగూడెంకు చెందిన పల్లపు రాము(46), కేతం కృష్ణమూర్తి(47), బండారి సురేష్ స్నేహితులు. వీరు ముగ్గురు జేసీబీల వ్యాపారంలో కొనసాగుతున్నారు. శ్రీశైలంలో స్వామి దర్శనానికి వెళ్లాలని నిర్ణయించుకున్న వీరు ఈనెల 22న కారులో బయలుదేరారు. అక్కడ దైవదర్శనం అనంతరం ఆదివారం తిరుగుముఖం పట్టారు. ఈ మేరకు ఆదివారం అర్ధరాత్రి ఇంకో పావు గంట అయితే ఇంటికి చేరతామనగా ఆటోనగర్ సమీపాన ఎదురుగా వస్తున్న ఇంకో వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో వీరి కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ సమయాన కారును సురేష్ నడుపుతున్నాడు. ఈ ప్రమాదంలో రాము తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, తీవ్రంగా గాయపడిన కృష్ణమూర్తిని స్థానికులు 108లో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా సోమవారం ఉదయం కన్నుమూశాడు. ఇక సురేష్‌కు కూడా గాయాలు కాగా చికిత్స అందిస్తున్నారు. అయితే, కారు అతివేగంతో వెళ్తుండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఘటనపై రాము భార్య రేణుక ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

మందు కలిసిన నీళ్లు తాగడంతో 22గొర్రెలు మృతి


చనిపోయిన గొర్రెల వద్ద బాధిత యజమాని

రఘునాథపాలెం: దాహార్తి అలమటిస్తున్న మూగజీవాలు పురుగుల మందు కలిపిన నీళ్లు తాగగా మృత్యువాత పడ్డాయి. బాధితులు, గ్రామస్తులు కథనం ప్రకా రం.. మండలంలోని కోయచలకకు చెందిన బొరిగర్ల లింగయ్య, బాబుకు చెందిన గొర్రెల మందను రోజులాగే మేతకు తీసుకెళ్లారు. ఒక రైతు మిర్చి తోటలో పిచికారీకి నీళ్లలో పురుగుల మందు కలిసి సిద్ధం చేయగా.. గొర్రెలు ఆ నీళ్లు తాగాయి. దీంతో గొర్రెలు వరుసగా కింద పడిపోతుండడంతో కాపరులు వెంటనే పశు వైద్యుడికి సమాచారం ఇస్తుండగానే 20గొర్రెలు, రెండు పోతులు ప్రాణం విడిచాయి. మిగిలిన వాటికి వైద్యం అందిస్తుండగా ఎన్ని కోలుకుంటాయో తెలియడం లేదు. సుమారు రూ.3.25లక్షలకు పైగా విలువైన గొర్రెలు చనిపోయినందున తమను ప్రభుత్వం ఆదుకోవాలని యజమానులు కోరారు. కాగా, బాధితులను మాజీ సర్పంచ్‌లు మాధంశెట్టి హరిప్రసాద్, రాంప్రసాద్, చెరుకూరి పూర్ణ, చెరుకూరి భిక్షమయ్య, నున్నా వెంకటేశ్వర్లు, తోట వెంకట్ తదితరులు పరామర్శించారు.

మూడు రోజుల క్రితం ఆత్మహత్య..

నేలకొండపల్లి: ఓ వ్యక్తి మూడు రోజుల క్రితం బలవన్మరణానికి పాల్పడగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దుర్వాసన ద్వారా సోమవారం స్థానికులు గుర్తించారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లికి చెందిన డి.హరీశ్(32) మూడు రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయాన ఉరి వేసుకున్నాడు. అప్పటి నుంచి ఎవరూ రాకపోవడంతో విషయం బయటపడలేదు. అయితే, సోమవారం సాయంత్రం ఆ ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అనుమానంతో కిటికీలో నుంచి చూడగా హరీశ్ వేలాడుతూ కనిపించాడు. కాగా, ఆయన తల్లితో కలిసి ఉంటుండగా, కొద్దిరోజుల క్రితం తల్లి ఊరికి వెళ్లినట్లు సమాచారం. అయితే, ఆయన ఆత్మహత్య కారణాలు తెలియాల్సి ఉంది.

కుటుంబ కలహాలతో వివాహిత..

వేంసూరు: కుటుంబ కలహాల కారణంగా వేంసూరుకు చెందిన గంటనల వరలక్ష్మి(35) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై వరలక్ష్మి తండ్రి రంగారావు ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

మున్నేటిలో ఈతకు వెళ్లిన యువకుడు మృతి

ఖమ్మంరూరల్: ఖమ్మం బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్ మౌలానా అలియాస్ అఫ్రోజ్(21) రాజీవ్ గృహకల్ప వద్ద మున్నేటికి వెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. పలువురు స్నేహితులతో కలిసి ఆయన సోమవారం సరదాగా వెళ్లాడు. అయితే, మౌలానాకు ఈత రాకపోవడంతో నీటిలోకి దిగగానే మునిగిపోసాగాడు. ఆయన వెంట ఉన్న వారికి కూడా ఈత రాక రక్షించే అవకాశం లేకపోవడంతో మృతి చెందాడు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న మౌలానా కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న సీఐ ముష్క రాజు, పోలీసులు చేరుకుని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఐదుగురిపై పోక్సో కేసు

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం హరిజనవాడ పంచాయతీకి చెందిన బాలికను(17)ను ప్రేమ పేరిట మాయమాటలతో నమ్మించి గర్భవతిని చేసి వ్యక్తితో పాటు పలువురిపై పోక్సో కేసు నమోదైంది. ప్రధాన నిందితుడైన ముల్లంగి జమలయ్యతో పాటు ఆయన తల్లిదండ్రులు ముసలయ్య – మరియమ్మ, బాలికను అబార్షన్‌ను ప్రేరేపించిన ఆర్ఎంపీ నరేందర్, గర్భ విచ్ఛిత్తికి ప్రయత్నించిన నర్సు భవానీపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్సై పి.వెంకటేశ్ తెలిపారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

14మందికి తృటిలో తప్పిన ప్రమాదం

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరేకోడు వద్ద కూలీలు వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. ముత్తగూడెంకు చెందిన 14మంది కూలీలు చింతపల్లిలో మిర్చి ఏరడానికి ఆటోలో వెళ్లారు. పని ముగిశాక తిరిగి ఆటోలోనే వస్తుండగా ఆరేకోడు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలోని పుల్లమ్మకు కాలు విరగగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే, ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈమేరకు స్థానికులు చేరుకుని క్షతగాత్రులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

జేసీబీని సీజ్ చేసిన అధికారులు


రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన జేసీబీ

దమ్మపేట : అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలకు పాల్పడుతున్న జేసీబీ యంత్రాన్ని రెవెన్యూ అధికారులు సోమవారం సీజ్ చేశారు. దమ్మపేట మండలంలోని గట్టుగూడెం గ్రామశివా రులో అనుమతులు లేకుండా జేసీబీ యంత్రంతో మట్టి తవ్వి, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారనే సమాచారం రెవెన్యూ అధికారులకు అందింది. దీంతో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, సీజ్ చేశామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.వాణి తెలిపారు.